

# నోరున్నవాడు

కొడవంటి కాశీపతిరావు

**ఆఫీసు** వదిలే టైమయ్యింది. గబ గబ సర్దుకుని జారి పోబోయాను దొరికిపోయాను.

"ఉండవోయ్, హరిబాబూ. నేనూ అటే వస్తాను" అంటూ సీట్లోంచి కేకేశారు గుర్నాథంగారు.

"చచ్చేంరా దేవుడా" అనుకుని పిడికిలి మూసి కిందికి దించి, బజారు పని ఉందన్నట్టు అభినయించాను.

"ఇక్కడెవరూ సన్యాసు ల్లేరు. నాకూ బజారు పని ఉంది గానీ, జారి పోబోకు". అంటూ తాళా లేసుకుని బయలుదేరారు గుర్నాథంగారు. ఆయన మా సెక్షను హెడ్డు.

మరింక తప్పలేదు.

భుజం మీద చెయ్యేసేసేరు." "పదవోయ్" అంటూ.

"ఉండండి" అన్నట్టుగా హస్తం చూపించి మళ్ళీ నా సీటు దగ్గిరికి వెళ్ళి ఒక అర దస్తా తెల్ల కాగితాలు డెస్కు లోంచి లాగాను.

అవి చూసి ఇల్లెగిరి పోయినట్టు పకపక నవ్వడం మొదలెట్టే రు గుర్నాథం గారు.

"అన్ని తెల్లకాగితా లెందుకోయ్? మన భాగోతాని కేనా?" అంటూ పెంకు లెగిరి పోయినట్టు నవ్వి, అన్ని అవసరం లేదు—ఒక్క టావు చాల్లే. హోం గవర్నమెంటుతో సినిమా ప్రోగ్రా ఉంది. వెళ్ళిపోవాలి" అన్నారు.

"హమ్మయ్య" అనుకున్నాను.

ఆఫీసుకు అంత దూరంలో ఉన్న కాఫీ హోటలుకు లాక్కెళ్ళారు.

"ఆఁ ఏం తీసుకుంటావోయ్" అంటూ పిడుగులు పడినట్టు అరిచారు కుర్చీలో కూర్చుంటూ.

భయం భయంగా చుట్టూ చూశాను అంత దూరం లోని టేబిలు దగ్గర ముగ్గురు కాలేజి స్టూడెంట్సు కాబోలు. వాళ్ళు తప్పిస్తే ఖాళీగానే ఉంది.

మళ్ళీ హస్తం అడ్డంగా తిప్పి, చూపిస్తూ ఒక్క కాఫీ చాలన్నట్లు చెప్పాను.

"రెండు కాఫీ తీసుకు రావోయ్." అంటూ ఉరిమేరు గుర్నాథం గారు సర్వర్ వైపు చూస్తూ.

అలవాటైన గొంతే అయినప్పటికీ ఒక్కసారి గతుక్కుమని బితుకూ బితుకూ చూస్తూ వెళ్ళిపోయాడు సర్వరు.

"ఇంతకీ ఏ సినిమాకు వెళతారు?" అని తెల్ల కాగితం మీద రాసి చూపించాను గుర్నాథంగారికి.

"నాకు ఫైటింగ్ లేని సినిమా చూడ్డమంటే ఉప్పులేని పప్పు తిన్నట్టుంటుంది. పైగా పాతసినిమాలైతే చచ్చిన శవాల నెత్తిచ్చి నటింప చేసి నట్టుంటుంది. కాని ఏం చేయను? మా ఆవిడకిష్టం. షర్మిళ్వరికి." అన్నాడు దడదడ మంటూ. భడభడ మంటూ మాట్లాడుతూ.

"అయ్యా. జనం దడుచు కుని ఇప్పటికే ఈ హోటలుకు రావడం మానేసి నట్టున్నారు. ఆ ముగ్గురూ తప్పించి ఎవరూ లేరు చూశారా?" అని రాసి చూపించాను నవ్వుతూ.

"హ హ్హ హ్హ" అంటూ ఘటోత్కచుడిలా అట్టహాసం చేశారు గుర్నాథం గారు.

"అలా నవ్వకండి, బాబూ' అన్నట్టు మూతి మీద చెయ్యేసు కుని ఆ కుర్రాళ్ళ వేపు కూడా సైగలు చేసి చూపించాను.

అప్పటికే ఆ ముగ్గురు కుర్రాళ్ళూ మా కేసి వింతగా చూస్తున్నారు. భయం భయంగా గుస గుస లాడుకుంటు న్నారు.

మా ఇద్దరి లోనూ నిజానికి వింత మనిషి గుర్నాథంగారు. ఆయన పెద్ద పొట్టా, గద్దించే మాటలూ, అదర గొట్టే అట్టహాసమూ—ఇవ్వన్నీ సాధారణంగా అందర్నీ ఆకర్షిస్తాయి.

కాని ఆశ్చర్యం! వాళ్ళు ముగ్గురూ నన్నే వింతగా చూస్తున్నారు. ఏదో చెప్పుకుని 'ప్చ్' అంటూ జాలి పడుతున్నారుకూడా.

నేను బిక్క మొహం పెట్టేశాను.

"చూసేరా గురుగారూ. ఆ కుర్రాళ్ళు మిమ్మల్ని చూడ్డం మానేసి నా మీద జాలి పడుతున్నారు." అంటూ రాసి దీనంగా చూపించాను గుర్నాథంగారికి.

రాసింది చూసి, దీనంగా ఉన్న నా మొహం చూసి ఖాళీ కప్పు టేబులు మీద పెడుతూ మరోసారి అట్టహాసం చేశారు. లేచి బిల్లు చెల్లించేసి ఆ కుర్రాళ్ళ వైపునడుస్తూ నన్నూ దగ్గిరికి పిలిచారు.

ఈ పెద్ద మనిషి అప్పుడంలా కరకర నమిలేస్తాడాఅన్నట్టు భయంగా చూస్తూన్నారు కుర్రాళ్ళు.

"నే నో చిన్న జోక్ చెబుతాను, చూడండి, బాబూ. ఈ కుర్రాడి పేరు హరిబాబు. ఇంతవరకూ మీ రనుకుంటున్నట్టు, జాలి పడుతున్నట్టు. ఈ కుర్రాడు మూగవాడు కాదు. నేనేవెవిటి వాణ్ణి" అంటూ నవ్వేసి ముందుకు దారి తీశారు.

"అవునండీ. నిజం" అని నాకు మాటలు వచ్చని రుజువుచేసుకునిగుర్నాథం గారివి ఫాలో అయ్యాను. *